సాక్షి
విశాఖపట్నం
బుధవారం ¦ 5 ¦ జూలై ¦ 2023

న్యూస్‌రీల్

స్టీల్‌ప్లాంట్ రికార్డ్ అమ్మకాలు



ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ 2023–24 మొదటి త్రైమాసికంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రూ. 5,290 కోట్లు రికార్డు అమ్మకాలు చేసింది. అదే విధంగా గతంలో ఏ జూన్ నెలలో చేయని విధంగా ఈ జూన్ నెలలో రూ. 1,823 కోట్లు అమ్మకాలు సాధించింది. విలువ ఆధారిత ఉత్పత్తులు జూన్ నెలలో 1,07,000 టన్నులు, మొదటి త్రైమాసికంలో 2,70,000 టన్నులు అమ్మకాలు చేసి గత రికార్డులను అధిగమించింది. ఈ సందర్భంగా యాజమాన్యం ఉద్యోగులను అభినందించింది.

కృష్ణా కళాశాలలో డేటా ఎంట్రీ కోర్సు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ విభాగంలో అసోసియేట్ డేటా ఎంట్రీ కోర్సు ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. కళాశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా పలు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు 42 రోజుల అసోసియేట్ డేటా ఎంట్రీ కోర్సులో శిక్షణ పొందవచ్చన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి చైతన్యకృష్ణ, కోర్సు కో–ఆర్డినేటర్ రాజశేఖర్, ట్రైనర్ సుగుణ, అధ్యాపకుడు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

‘భవన నిర్మాణ కార్మికుల భద్రత ముఖ్యం’



మాట్లాడుతున్న సెంట్రల్ రేరా బోర్డు సభ్యుడు శ్రీనివాస నాయుడు

కొమ్మాది: భవన నిర్మాణ కార్మికుల భద్రతకు కచ్చితంగా నిబంధనలు పాటించాలని సెంట్రల్ రేరా(రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ) బోర్డు సభ్యుడు వి.శ్రీనివాసనాయుడు స్పష్టం చేశారు. ఎండాడ, మధురవాడ ప్రాంతాల్లో జరుగుతున్న బహుళ అంతస్తుల నిర్మాణాలను మంగళవారం ఆయన పరిశీలించారు. భవన నిర్మాణ సమయంలో కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అవి తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. కొంత మంది బిల్డర్లు ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను రప్పించుకుని వారికి ఎటువంటి రక్షణ గానీ, వైద్య పరంగా మౌలిక సదుపాయాలు కల్పించడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికులకు బీమా సదుపాయం కల్పిస్తున్నాయని.. వాటిని కార్మికులు వినియోగించుకోవాలని కోరారు. భవన నిర్మాణంలో ఎటువంటి లోపాలున్నా బిల్డర్లకు నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు.

ట్రైబల్ కల్చరల్ అండ్ ట్రైనింగ్ మిషన్‌కు ఐఎస్‌వో సర్టిఫికెట్



సర్టిఫికెట్ అందుకుంటున్న సంస్థ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: ట్రైబల్ కల్చరల్ అండ్ ట్రైనింగ్ మిషన్‌కు అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాల సంస్థ (ఐఎస్‌వో) గుర్తింపు లభించింది. సంస్థను అత్యంత క్వాలిటీ మేనేజ్‌మెంట్‌గా గుర్తిస్తూ ఐఎస్‌వో 9001–2015 సర్టిఫికెట్ జారీ చేసింది. నగరంలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి రాజన్న దొర చేతుల మీదుగా ట్రైబల్ కల్చరల్ అండ్ ట్రైనింగ్ మిషన్ ప్రతినిధులు సర్టిఫికెట్ అందుకున్నారు. అరకు ఎంపీ మాధవి, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, హైమా ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ సంస్థ ఎండీ ఆలపాటి శివ, సన్ గ్రీన్ సీఈవో డాక్టర్ శృతి పాల్గొన్నారు.

27న జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

మహారాణిపేట: జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు ఈనెల 27న నిర్వహించనున్నట్లు సీఈవో శ్రీరామ్మూర్తి తెలిపారు. జిల్లా పరిషత్ ఆవరణలో జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఒకటి నుంచి ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు జరుగుతాయని, ఈ మేరకు సభ్యులకు ఆహ్వానం పంపినట్లు పేర్కొన్నారు.

‘భవిత’కు వెన్నుదన్ను

- ప్రత్యేక అవసరాల పిల్లల సంక్షేమానికి పెద్దపీట
- భవిత కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ
- ‘నిరామయ’తో ఆరోగ్య రక్ష
- ఏడాదికి రూ.లక్ష వరకు ఉచిత వైద్యం
- 512 మందికి నిరామయ కార్డులు
- కలెక్టర్ చొరవతో ప్రీమియం చెల్లింపు
- వైద్య సేవలు అందేలా కేంద్రాల్లో నిపుణుల నియామకం



కేంద్రంలో సేవలు అందుకుంటున్న చిన్నారులు, వారి పక్కన తల్లులు

విశాఖ విద్య : ప్రత్యేక అవసరాల పిల్లల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. జిల్లాలో 14 ఏళ్లలోపు వయసు గల ప్రత్యేక అవసరాల(సీడబ్ల్యూఎస్ఎన్) పిల్లలు 1,990 మంది ఉన్నట్లు అధికార యంత్రాంగం గుర్తించింది. కంటి చూపు, వినికిడి లోపం, మాటలు రాని, చలన స్థితి లేకుండా, పక్షవాతం, మూగ, నేర్చుకునే లోపం, మానసిక వైకల్యాలతో ఎక్కువ మంది పిల్లలు బాధపడుతున్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భవిత కేంద్రాల్లో వీరికి అవసరమైన సేవలు అందిస్తున్నారు.

‘నిరామయ’తో ఉచిత వైద్యం

ప్రత్యేక అవసరాల పిల్లల ఆరోగ్య పరిరక్షణకు పెద్ద పీట వేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. దీనిలో భాగంగా ‘నిరామయ’ ఆరోగ్య భద్రతా పథకం కింద ప్రభుత్వ, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఏడాదికి రూ. లక్ష ఖరీదు చేసే ప్రత్యేక వైద్యం చేయించుకునేలా గుర్తింపు కార్డులను అందజేస్తున్నారు. వైద్య పరీక్షలు, ఆపరేషన్, అవయవమార్పిడి వంటివి చేయించుకోవచ్చు. ఇందుకోసం ఏడాదికి ఒక్కొక్కరు రూ.250లు, ఏడాదికి రూ.1.80 లక్షల కుటుంబ ఆదాయం దాటిన వారైతే రూ.500లు ప్రీమియంగా చెల్లించాల్సి ఉంది. జిల్లాలో 512 మందిని అర్హులుగా ఎంపిక చేయగా, వీరి బీమా ప్రీమియం మొత్తం రూ. 1,34,750లను కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ‘సంజీవని’ నిధుల నుంచి చెల్లించి, అర్హులైన వారందరికీ నిరామయ కార్డులు ఇప్పించేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు.

మానసిక వికాసం విరజిమ్మేలా..

పిల్లలకు ఆటపాటలతో విద్యాబుద్ధులు నేర్పించేలా కేంద్రాల్లో శిక్షణ పొందిన ఐఈఆర్టీలు కృషి చేస్తున్నారు. అంతేకాకుండా ఫిజియో థెరపిస్టు, సైకాలజిస్టు, స్పీచ్ థెరపిస్టులతో అవసరమైన వారికి ఇళ్లకు వెళ్లి సైతం వైద్య సేవలు అందిస్తూ, ప్రత్యేక అవసరాల పిల్లల్లో మార్పు తీసుకొస్తున్నారు. అవసరమైన వారికి ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు పంపిణీ చేశారు. అదేవిధంగా ఒక్కొక్కరికి రూ. 10 వేలు ఖరీదు చేసే ఆట వస్తువులతో కూడిన కిట్‌ను ఇటీవలే విద్యార్థులకు అందజేశారు. ప్రత్యేక అవసరాల పిల్లల విషయంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ పట్ల తల్లిదండ్రులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో భవిత కేంద్రాలు	4
నాన్ భవిత కేంద్రాలు	8
గుర్తించిన ప్రత్యేక అవసరాల పిల్లలు	1,990
కేంద్రాలకు వస్తున్న వారు	164
ఇంటి వద్దనే సేవలు పొందేవారు	80
నిరామయ కార్డులకు అర్హతగల వారు	512

కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ



భవిత కేంద్రాల ప్రాధాన్యత దృష్ట్యా వీటిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ఉన్నతాధికారుల సూచనలకు అనుగుణంగా ప్రభుత్వ ఆశయ సాధనకు కృషి చేస్తున్నాం. జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున చొరవతో నిరామయ కార్డుల నమోదు ప్రక్రియలో రాష్ట్రంలో కెల్లా మన జిల్లానే ముందంజలో ఉంది.

– ఎం.అబ్దుల్ ఆషా, సహితవిద్య జిల్లా కో–ఆర్డినేటర్, విశాఖపట్నం

వారంతా మా పిల్లలే..



వైకల్యం శరీరానికే కాని, మనసుకు కాదని తల్లిదండ్రుల్లో చైతన్యం నింపి, ప్రత్యేక అవసరాల పిల్లలందరినీ కేంద్రాలకు రప్పిస్తున్నాం. మా సొంత బిడ్డల మాదిరే చూసుకుంటూ, పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్నాం. మెరుగైన ఫలితాలు కనిపిస్తుండటంతో తల్లిదండ్రులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల ప్రోత్సాహంతోనే మేము ఉత్సాహంగా పనిచేస్తున్నాం.

– జగదాంబ, ఐఈఆర్టీ, అక్కయ్యపాలెం

ఎనలేని సేవలు



వినికిడిలోపం, బుద్ధిమాంద్యంతో ఇబ్బంది పడుతున్న మా బాబుకు భవిత కేంద్రం భవిష్యత్‌ను ఇచ్చింది. ఈ ఏడాది పదో తరగతి పాసయ్యాడు. అమ్మ ఒడి డబ్బులు వస్తున్నాయి. నెలకు రూ.3 వేలు పింఛన్ ఠంఛన్‌గా వస్తోంది. భవిత కేంద్రంకు తీసుకొచ్చినందుకు అదనంగా నెలకు రూ.300లు చొప్పున ఇచ్చారు.

– మూల దుర్గ, బర్మాక్యాంపు

రేటు వెరీ ‘గుడ్డు’!

- వంద కోడిగుడ్ల ధర రూ.515
- నిన్న మొన్నటి వరకు రూ.550
- ఈ సీజనులో ఇదే అత్యధికం
- క్రమంగా ధర దిగి వచ్చే అవకాశం
- ఉత్తరాంధ్రలో రోజుకు 50 లక్షల గుడ్ల ఉత్పత్తి
- వీటిలో 40 లక్షల వరకు స్థానికంగా వినియోగం



సాక్షి, విశాఖపట్నం: ఎండలతో పాటే కోడిగుడ్డు ధర కూడా ఎగబాకింది. ప్రస్తుతం వంద గుడ్ల రేటు రూ.515 పలుకుతోంది. నిన్న మొన్నటి వరకు ఈ సీజనులోనే అత్యధికంగా వీటి ధర రూ.550 ఉంది. నెల రోజుల క్రితం జూన్ ఒకటో తేదీన విశాఖపట్నంలో వంద కోడిగుడ్ల రేటు రూ.510 ఉండేది. అలా క్రమంగా పెరుగుతూ జూన్ 15 నాటికి రూ.550కి చేరుకుంది. దాదాపు 20 రోజుల పాటు అదే ధర కొనసాగింది. మంగళవారానికి రూ.35 తగ్గి రూ.515కి దిగి వచ్చింది. మార్కెట్లో రిటైల్‌గా ఒక్కో గుడ్డు రూ.6 చొప్పున విక్రయిస్తున్నారు. వంద గుడ్ల ధర రూ.550 ఉన్నప్పుడు విడిగా రూ.7కి అమ్మేవారు. గుడ్ల ధరలు పెరగడానికి కొన్ని నెలలుగా కాస్తున్న ఎండలు, వడగాడ్పులు కారణమని కోళ్ల పెంపకందార్లు చెబుతున్నారు. వడగాడ్పుల తీవ్రతకు కోళ్లు చనిపోతుంటాయి. అలాగే వేసవి తాపానికి ఫారాల్లోని కోళ్లు సరిగా మేత తినవు. దీంతో 10 శాతం వరకు గుడ్ల ఉత్పత్తి కూడా తగ్గిపోతుంది. ఫలితంగా డిమాండ్‌కు సరిపడా గుడ్ల లభ్యత లేక వీటి ధర పెరగడానికి కారణమవుతుందని పౌల్ట్రీ రైతులు పేర్కొంటున్నారు. ఎండల తీవ్రత తగ్గితే మళ్లీ గుడ్ల ఉత్పత్తి పెరుగుతుందని చెబుతున్నారు.

కోల్‌కతా బహిరంగ మార్కెట్ ప్రభావం

ఉత్తరాంధ్రలోని కోడిగుడ్లపై కోల్‌కతా బహిరంగ మార్కెట్ ప్రభావం ఉంటుంది. అక్కడ మార్కెట్‌కు ఇతర రాష్ట్రాల నుంచి గుడ్లు ఎక్కువగా వస్తే ధర తగ్గుతుందని, ఆ ప్రభావం ఇక్కడ కూడా పడుతుందని వీరు అంటున్నారు. ప్రస్తుతం వేసవి తీవ్రత తగ్గుముఖం పడుతోందని, దీంతో క్రమంగా కోడి గుడ్ల ఉత్పత్తి ఊపందుకుంటుందని, ఫలితంగా రానున్న రోజుల్లో వీటి ధర ఇంకా తగ్గే అవకాశం ఉందని నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (నెక్) జాతీయ కార్యవర్గ సభ్యుడు భరణికాన రామారావు ‘సాక్షి’కి చెప్పారు.

రోజుకు 40 లక్షల గుడ్ల వినియోగం

ఉత్తరాంధ్రలో వివిధ పౌల్ట్రీల్లో పెరుగుతున్న కోళ్ల ద్వారా రోజుకు సగటున 50 లక్షల కోడిగుడ్ల ఉత్పత్తి జరుగుతుంది. వీటిలో 40 లక్షల గుడ్లు అంటే 80 శాతం వరకు స్థానికంగానే వినియోగమవుతాయి. మిగిలిన 20 శాతం ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంటాయి. దాదాపు నెల రోజులుగా కోడిగుడ్ల ధరలు సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోయాయి. హోల్‌సేల్‌గా వంద గుడ్లు రూ.550 ధర కొనసాగింది. దీంతో రిటైల్ మార్కెట్లో విడిగా ఒక్కో గుడ్డు రూ.7 చొప్పున విక్రయించడంతో ఈ ధర మధ్య తరగతి వారికి భారంగా మారింది. అయితే ప్రస్తుతం గుడ్డు ధర దిగివస్తుండడం వీరికి కాస్త ఉపశమనం కలిగిస్తోంది. పౌల్ట్రీ రైతులు మాత్రం ఇంతకన్నా ధర తగ్గితే తాము నష్టపోతామని చెబుతున్నారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

ఆరిలోవ: జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు–2023 కోసం దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన అన్ని యాజమాన్యాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఈనెల 15లోగా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. వివరాలకు https://nationalawardstoteachers.education.gov.in/ వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.

తరతరాలకు స్ఫూర్తిదాత అల్లూరి



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తదితరులు

పద్మనాభం: తెలుగు ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న మహానుభావుడు అల్లూరి సీతారామరాజు అని కలెక్టర్ మల్లికార్జున అన్నారు. పాండ్రంగిలో మంగళవారం అల్లూరి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి అల్లూరి చిత్రపటానికి కలెక్టర్ పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ పాండ్రంగిలో జన్మించడం మీ అందరి అదృష్టమన్నారు. చిన్న వయసులోనే అల్లూరి ఎన్నో ప్రాంతాలు తిరిగి.. ఎంతో విజ్ఞానం సంపాదించి.. స్వాతంత్య్ర ఉద్యమంలో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ఆయన జీవిత చరిత్ర యువతకు ఆదర్శమన్నారు. పాండ్రంగిలో అల్లూరి పేరు మీద మ్యూజియం నిర్మిస్తున్నట్టు తెలిపారు. పాండ్రంగిలో రూ.52లక్షలతో కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. పాండ్రంగి సమీపం గోస్తనిపై వంతెన నిర్మాణానికి త్వరలోనే టెండర్లు పిలుస్తామని వెల్లడించారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన విప్లవజ్యోతి అల్లూరి అని కొనియాడారు. మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్య నారాయణ, జెడ్పీటీసీ సభ్యులు సుంకర గిరిబాబు, గాడు వెంకటప్పడు, కోరాడ వెంకటరావు, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, తహసీల్దార్ తోట శ్రీవల్లి, పాండ్రంగి సర్పంచ్ పల్లి ఝాన్సీ, ఎంపీటీసీ పిన్నింటి నారాయణమ్మ, పాండ్రంగి కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు అముజూరి అప్పారావు పాల్గొన్నారు.



పోలీస్ కమిషనర్ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ

స్వరాజ్య సమర ఖ్యాతి..



అల్లూరికి నివాళులర్పిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

బీచ్‌రోడ్డు: అల్లూరి సీతారామరాజు ధైర్యం, తెగువ ఎనలేనిది, ప్రజల గుండెల్లో ఆయన స్థానం సుస్థిరమని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. మన్యం వీరుడు జయంతి సందర్భంగా బీచ్ రోడ్డులోని ఆయన విగ్రహానికి మంగళవారం జీవీఎంసీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్య్ర ఉద్యమంలో తెల్లదొరలను గడగడలాడించి.. గిరిజన హక్కులకై పోరాడిన మహోన్నత వ్యక్తి అల్లూరి అని కొనియాడారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ విప్లవ జ్యోతి అల్లూరి దేశ స్వాతంత్య్రం కోసం ఎనలేని కృషి చేశారన్నారు. డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు తదితరులు పాల్గొన్నారు.



అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా 49వ వార్డు బర్మాక్యాంప్ సమీపంలోని ఏఎస్ఆర్ నగర్‌లో ఉత్తర సమన్వయకర్త కేకే రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

పది ఫెయిలైనా మళ్లీ పాఠశాలలో చేరొచ్చు

- అన్ని పథకాలు వర్తిస్తాయి
- ఆరిలోవ ప్రాంతంలో డీఈవో పర్యటన



ఆరిలోవలో పదో తరగతి తప్పిన విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

ఆరిలోవ: పదో తరగతిలో ఉత్తీర్ణులు కాలేకపోయిన వారు మళ్లీ అదే పాఠశాలలో చేరి చదువుకోవచ్చని డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. తోటగరువులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆమె సందర్శించారు. అనంతరం హెచ్‌ఎం దుర్గాభవాని, ఉపాధ్యాయులతో కలిసి బాలాజీనగర్, అంబేడ్కర్‌నగర్‌లో పర్యటించారు. తోటగరువు ఉన్నత పాఠశాలలో 2022–23 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివి.. ఫెయిల్ అయిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడి అవగాహన కల్పించారు. విద్యార్థులను మళ్లీ పదో తరగతిలో చేర్పించాలని, బోధనతో పాటు జగనన్న విద్యా కానుక కిట్లు, అన్ని పథకాలు వర్తిస్తాయని చెప్పారు. జిల్లాలో 10వ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులంతా చదువుకున్న పాఠశాలల్లో మళ్లీ చేరాలని సూచించారు. కాగా.. తోటగరువు హైస్కూల్‌లో ఇలాంటి విద్యార్థులు ఐదుగురు మళ్లీ చేరేందుకు ముందుకొచ్చారని హెచ్‌ఎం దుర్గాభవాని తెలిపారు.

వైఎస్సార్ సీపీ గెలుపులో యువత కీలకపాత్ర

- సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి శివనందీష్ బాబు, జిల్లా అధ్యక్షుడు శివగణేష్ పిలుపు



మాట్లాడుతున్న యువజన విభాగం నాయకులు శివనందీష్‌బాబు, శివగణేష్

సాక్షి, విశాఖపట్నం: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపులో యువత కీలక పాత్ర పోషించాలని యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి ముత్తంశెట్టి శివనందీష్ బాబు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్ పిలుపునిచ్చారు. మద్దిలపాలెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం యువజన విభాగ ముఖ్యనేతలతో ముఖాముఖి కార్యక్రమం జరిగింది. వార్డు నుంచి నియోజకవర్గస్థాయి వరకు యువజన విభాగం పటిష్టం చేసేలా పలు అంశాలపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో యువతకే తొలి ప్రాధాన్యం కల్పించారని.. సచివాలయ వ్యవస్థ నెలకొల్పి లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పించారన్నారు. ఆయన్ని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటే యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లేలా అందరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. విశాఖ పరిపాలనా రాజధాని అయితే వచ్చే లాభాలు, ప్రయోజనాలను వివరించాలని సూచించారు. జోనల్ యువజన విభాగం నాయకులు అంబటి శైలేష్, చొక్కర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో రోశయ్య విగ్రహం ఏర్పాటు

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్



మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పాల్గొన్న నగర ప్రముఖులు

సీతమ్మధార: నగరంలో మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య విగ్రహం ఏర్పాటుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగీకరించారని.. త్వరలో పనులు ప్రారంభిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వెల్లడించారు. డైమండ్ పార్కు దరి ఓ హోటల్‌లో మంగళవారం రోశయ్య 90వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆచార్య ఎన్.జి.రంగా శిష్యుడిగా ముద్ర వేసుకున్న రోశయ్య తన కుటుంబాన్ని రాజకీయాలకు దూరంగా ఉంచారన్నారు. మాట.. కత్తి కంటే పదునైనదని పలు సందర్భాల్లో ఆయన నిరూపించారన్నారు. ఉమ్మడి ఏపీలో వరుసగా ఏడు పర్యాయాలు బడ్జెట్ ప్రవేశపెట్టిన రోశయ్య రికార్డు సృష్టించారన్నారు. ఎవరినైనా కలుపుకొనిపోయే స్వభావం, అపార అనుభవం, విషయాలపై స్పష్టమైన అవగాహన, చక్కని భాష, సమయస్ఫూర్తి వంటివన్నీ రోశయ్యను ఉన్నత శ్రేణిలో నిలబెట్టాయన్నారు. రాజకీయాల్లో ఎంత బిజీగా ఉన్నా కుటుంబం బాగోగులను చూసుకోవడంలోనూ, కుటుంబ సభ్యులకు ఆప్యాయత పంచడంలోనూ రోశయ్య ముందుండేవారని మంత్రి చెప్పారు. రోశయ్యతో తన తండ్రి గుడివాడ గురునాథరావుకు మంచి అనుబంధం ఉండేదని గుర్తు చేసుకున్నారు. కుర్తాళం శంకరాచార్య శ్రీ లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి సరస్వతి స్వామి ప్రసంగిస్తూ.. విద్యార్థి దశ నుంచే రోశయ్య తనకు తెలుసని, ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. పోతన, నన్నయ్య, తిక్కన, శ్రీకృష్ణ దేవరాయలు తదితర పాత్రలను రోశయ్య పోషించి అద్భుతంగా నటించారని, శ్రీనాథపీఠం స్థాపించారన్నారు. మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ ఆయన వ్యంగ్యాస్త్రాలను తట్టుకోలేక మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ శాసనమండలిని రద్దు చేశారని, నీతి నిజాయతీలతో కూడిన రాజకీయం చేసిన మహానుభావుడు రోశయ్య అని కొనియాడారు. పైడా కళాశాలల అధినేత పైడా కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో రోశయ్య ఎవరినీ నొప్పించలేదన్నారు. కార్యక్రమంలో నగర ప్రముఖులు, రోశయ్య అభిమానులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీవోఐలో మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్లు

సీతమ్మధార: మహిళలు, ఆడపిల్లల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త పథకం 'మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికేట్' బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఈనెల 3వ తేదీన ప్రారంభించడం పట్ల బ్యాంక్ జోనల్ మేనేజర్ కె.శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా అన్ని శాఖల ద్వారా ఈ పథకం మహిళలకు, ఆడపిల్లలకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. వ్యక్తిగత ఖాతా ద్వారా ఈ పథకం డిపాజిట్లు చేయవచ్చునన్నారు. ఆర్థిక ప్రయాణంలో గణమైన అభివృద్ధి చెంది సాధికారత పొందగలరన్నారు. మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్‌ను తెరవడానికి సమీపంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లను సందర్శించాలని కోరారు.

రాణించిన యశ్వంత్, ప్రసాద్

విశాఖ స్పోర్ట్స్: ఏసీఏ అండర్ 19 మెన్ మల్టీడే అంతర జిల్లాల లీగ్ మ్యాచ్‌ల్లో భాగంగా విజయనగరంపై టాస్ గెలిచి విశాఖ జట్టు తొలుత బ్యాటింగ్ చేసింది. విజయనగరంలోని విజ్జీ గ్రౌండ్స్‌లో మంగళవారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో తొలిరోజు విశాఖ జట్టు నిర్ణీత 90 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 369 పరుగులు చేసింది. కెప్టెన్ యశ్వంత్(135) సెంచరీ చేయగా ప్రసాద్ 83 పరుగులు చేశాడు. విజయనగరం బౌలర్లు యశ్వంత్, కార్తికేయ చెరో మూడేసి వికెట్లు తీయగా దామోదర్ రెండు వికెట్లు తీశాడు.

కాలినడకన సాహస యాత్ర


యతి గౌర్

బీచ్‌రోడ్డు: గ్రామాల సంస్కృతీ సంప్రదాయాలను తెలుసుకునేందుకు ఉత్తరప్రదేశ్ నొయిడాకు చెందిన యతి గౌర్ సాహస యాత్ర చేస్తున్నారు. కాలినడక దేశవ్యాప్తంగా ఉన్న గ్రామాలను, నగరాలను సందర్శించి అక్కడ సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకుంటున్నాడు. ఈ క్రమంలో గౌర్ మంగళ వారం విశాఖ చేరుకున్నాడు. బద్రీనాథ్‌లో గతేడాది నవంబర్ 1న సాహస యాత్ర ప్రారంభించాడు. రోజు 20 నుంచి 30 కిలోమీటర్లు నడుస్తున్నట్టు చెప్పాడు.

పారదర్శకంగా ఓటరు జాబితా రూపకల్పన

కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: ఓటు నమోదులో బూత్ లెవల్ అధికారులు(బీఎల్‌వో) కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో మంగళవారం ఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లు, బూత్ లెవల్ అధికారులకు 'స్పెషల్ సమ్మరీ రివిజన్-2024'పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ముందుగా అల్లూరి జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్, నవంబర్‌లో స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్) డ్రాఫ్ట్ విడుదల చేయాల్సి ఉంటుందని, వచ్చే జనవరిలో ఫైనల్ ఎస్ఎస్ఆర్ ప్రకటిస్తామన్నారు. ఓటర్ల చేర్పు


అల్లూరి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మార్పుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని, పారదర్శకంగా జాబితాను రూపొందించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ మాట్లాడుతూ గతంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బూత్ లెవల్ అధికారులుగా పని చేశారని.. ఇప్పుడు సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న వారిని వినియోగిస్తామన్నారు. జాబితాలో ఓటర్లను తొలగించడం/చేర్చడం/మార్పు చేయడం తదితర అంశాల్లో పూర్తిగా ధ్రువీకరించిన అనంతరం చర్యలు చేపట్టాలన్నారు. విశాఖ దక్షిణ, గాజువాక, భీమిలి, పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల్లో విధులు నిర్వర్తించే ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, సూపర్ వైజర్లు, బూత్ లెవల్ అధికారులకు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. మంగళవారం హాజరు కాని వారు బుధవారం జరిగే శిక్షణ తరగతులకు హాజరుకావాలని ఆదేశించారు. డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్‌రెడ్డి, వీఎంఆర్డీఏ ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

మహిళను చంపిన కేసులో నిందితుడికి యావజ్జీవ ఖైదు


రావాడ ఏసు

విశాఖ లీగల్/పాయకరావుపేట: క్షణికావేశంలో మహిళను అతి కిరాతకంగా హత్య చేసిన వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ నగరంలోని 12వ అదనపు న్యాయమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. జైలు శిక్షతో పాటు రూ.5000 జరిమానా చెల్లించాలని, లేని పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి పేర్కొన్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.దేవానందరావు, పాయకరావుపేట పోలీసులు వేర్వేరుగా తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాయకరావుపేట ఇందిరా కాలనీకి చెందిన బొల్లం రాజ్యలక్ష్మి భర్తను విడిచిపెట్టి ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి వద్ద ఉంటోంది. ఇదే క్రమంలో ఇంటి పక్కనే ఉన్న రావాడ ఏసుతో వివాహేతర సంబంధం పెట్టుకొని లింగాల తోటకాలనీలో సహజీవనం చేస్తోంది. రావాడ ఏసు వృత్తిరిత్యా తాపీమేస్త్రి. 2015 అక్టోబర్‌లో నిందితుని భార్య పురిటికి తన పుట్టింటికి వెళ్లింది. ఆ సమయంలో రాజ్యలక్ష్మి ఏసు ఇంట్లో ఉంది. ఈ క్రమంలో వారిద్దరి నడుమ గొడవ జరగడంతో కోపోద్రిక్తుడైన ఏసు 2015 అక్టోబరు 1వ తేదీన అర్ధరాత్రి సమయంలో రాజ్యలక్ష్మిని ఇంటి పక్కనే ఉన్న పనస చెట్టుకు ఆనించి గొంతు నులిమి హత్య చేశాడు. రాజ్యలక్ష్మి చనిపోయిందని ఆమె తల్లికి సమాచారం ఇవ్వడంతో ఆమె వచ్చి తన కుమార్తె మరణంపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు పాయకరావుపేట పోలీసులు హత్య కేసుగా నమోదు చేశారు. విచారణలో ఇది హత్య అని రుజువై, ఈ దారుణానికి ఒడిగట్టింది రావాడ ఏసుగా నిర్ధారణ కావడంతో విశాఖపట్నం 12వ ఏడీజే కోర్టు వారు మంగళవారం నిందితుడికి శిక్ష విధిస్తూ పై విధంగా తీర్పు చెప్పారు. ఈ కేసు దర్యాప్తు చేసిన ఇన్‌స్పెక్టర్లు కె. వెంకటరావు, జి.రాంబాబు, వాదనలను వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.దేవానందరావులను జిల్లా ఎస్పీ కె.వి. మురళీకృష్ణ అభినందించారు.

పలు రైళ్లకు అదనపు హాల్ట్‌లు

తాటిచెట్లపాలెం: విశాఖ-కోర్బా-విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు సింగపూర్‌రోడ్‌లో ప్రయోగాత్మక హాల్ట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. విశాఖలో రోజూ బయల్దేరే విశాఖ-కోర్బా(18517) ఎక్స్‌ప్రెస్‌కు గురువారం నుంచి, తిరుగు ప్రయాణంలో కోర్బాలో బయల్దేరే కోర్బా -విశాఖ (18518) ఎక్స్‌ప్రెస్‌కు గురువారం నుంచి సింగపూర్ రోడ్ స్టేషన్‌లో రెండేసి నిమిషాలు హాల్ట్ ఇస్తున్నారు. గురువారం నుంచి విశాఖలో బయల్దేరే విశాఖ-కోర్బా ఎక్స్‌ప్రెస్ తెల్లవారు 2.30గంటలకు సింగపూర్ రోడ్ చేరుకుని, అక్కడ నుండి 2.32గంటలకు బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో గురువారం కోర్బాలో బయల్దేరే కోర్బా - విశాఖ ఎక్స్‌ప్రెస్ మధ్యరాత్రి 12.30గంటలకు సింగపూర్ రోడ్ చేరుకుని, అక్కడ నుంచి 12.32గంటలకు బయల్దేరుతుంది. గుంటూరులో గురువారం బయల్దేరే గుంటూరు -రాయగడ (17243) ఎక్స్‌ప్రెస్‌కు భీమడోలులో అదనపు హాల్ట్‌ను ప్రయోగాత్మకంగా కల్పిస్తున్నారు. ఈ రైలు గురువారం నుంచి రోజూ అర్ధరాత్రి 1.32గంటలకు భీమడోలు చేరుకుని, అక్కడ నుంచి 1.33 గంటలకు బయల్దేరుతుంది.

గంగవరం పోర్టు కార్మికుల నిరవధిక సమ్మె


కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న కార్మికులకు జీతాలు పెంచాలని కోరుతూ గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం నిరవధిక సమ్మె చేపట్టారు. పోర్టు వంతెన సమీపంలోని స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన శిబిరాన్ని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, చింతలపూడి వెంకట్రామయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి సందర్శించి, కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ విధుల నుంచి తొలగించిన వారిని మళ్లీ విధుల్లోకి తీసుకునే వరకూ పోరాటం చేస్తామన్నారు. కార్మికులకు వేతనాలు పెంచకుండా అత్యంత తక్కువ వేతనాలు ఇచ్చి, నిర్వాసిత కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. సంప్రదింపుల ద్వారా సమస్యలను పరిష్కరించకపోతే గంగవరం పోర్టును స్తంభింపజేస్తామని, షిప్పులను నిలిపివేస్తామని హెచ్చరించారు. జనసేన పార్టీ నాయకుడు కోన తాతారావు, కార్పొరేటర్లు దల్లి గోవింద్, బొడ్డు నర్సింహపాత్రుడు, పల్లా శ్రీనివాసరావు శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ సంఘం నాయకు డు ఆదినారాయణ, సీపీఐ నాయకుడు కసిరెడ్డి సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జగన్, కొవిరి అవతారం, కొవిరి అప్పలరాజు, నొల్లి తాతారావు, వాసుపల్లి, అమ్మోరు పాల్గొన్నారు.

న్యాయవాదుల ధర్నా



జిల్లా కోర్టు మెయిన్‌గేటు వద్ద ధర్నా చేస్తున్న న్యాయవాదులు

విశాఖ లీగల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ న్యాయవాదులు ఆందోళనకు దిగారు. మంగళవారం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) విశాఖ జిల్లా, పట్టణ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఎదుట ధర్నా నిర్వహించారు. న్యాయవాదులకు రక్షణ కల్పించాలని, మరణించిన న్యాయవాదులకు పరిహారం ఇవ్వాలని, లా నేస్తం నిధులు పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ.జె.ఆర్.అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

ట్రస్ట్ బోర్డు సమావేశం నిర్వహించాలి


ఈవోతో చర్చిస్తున్న ట్రస్ట్‌బోర్డు సభ్యులు

సింహాచలం: చందనోత్సవం, గిరిప్రదక్షిణల నిర్వహణలపై వెంటనే ట్రస్ట్‌బోర్డు సమావేశం ఏర్పాటు చేయాలని సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావును ట్రస్ట్‌బోర్డు సభ్యులు కోరారు. ఈమేరకు సింహగిరిపై మంగళవారం ఈవోకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రస్ట్‌బోర్డు సమావేశం నిర్వహించాలని ఏప్రిల్ 26న దేవస్థానానికి లేఖ ఇచ్చామన్నారు. కానీ దేవస్థానం అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. ఈనెల 10, 13,19 తేదీల్లో ఏదొక రోజు సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. చందనోత్సవం, గిరిప్రదక్షిణ ఉత్సవాలు ముగిసిన నేపథ్యంలో ఈవోతో చర్చించారు. దేవస్థానం, జీవీఎంసీ, స్వచ్ఛంద సేవా సంస్థల సమన్వయంతో గిరిప్రదక్షిణ విజయవంతంగా జరిగిందని ట్రస్ట్‌బోర్డు సభ్యులు తెలిపారు. పోలీసుల వైఖరివల్ల సేవా సంస్థలు, ఉద్యోగులు, వలంటీర్లు కొంతమేర ఇబ్బంది పడ్డారని పేర్కొన్నారు. గిరిప్రదక్షిణకు సంబంధించి కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమన్వయ సమావేశానికి ట్రస్ట్‌బోర్డు సభ్యులను ఆహ్వానించలేదని, దానికి గల కారణాలు తెలపాలని ఈవోను కోరారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి, వైఎస్సార్‌సీపీ పెద్దల దృష్టికి తీసుకెళ్తామని సభ్యులు సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్, దొడ్డి రమణ, సువ్వాడ శ్రీదేవి, ముదుండి రాజేశ్వరి, పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, దశమంతుల రామలక్ష్మి, పెనుమత్స శ్రీదేవి వర్మ పేర్కొన్నారు.

విషమంగానే నూకినాయుడు ఆరోగ్యం

మహారాణిపేట: అచ్చుతాపురం సాహితీ ఫార్మా పరిశ్రమల్లో జరిగిన అగ్ని ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నూకినాయుడు పరిస్థితి విషమంగా ఉంది. గత నెల 30న అచ్యుతాపురం సాహితీ ఫార్మా పరిశ్రమలో గాయపడ్డ నూకినాయుడును చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఎస్ఆర్ బ్లాక్‌లో చికిత్స పొందుతున్న నూకినాయుడు పరిస్థితి విషమంగా ఉందని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. కిడ్నీ ఫెయిల్యూర్ కావడం, ఇతర అవయవాలు పనిచేయకపోవడంతో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నామన్నారు. ప్రమాద సంఘటనలో ఇప్పటి వరకు నలుగురు మృతి చెందిన విషయం తెలిసిందే.

స్కూల్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఆర్జేడీ జ్యోతి కుమారి

46 మందికి గ్రేడ్-2 హెచ్ఎంలుగా పదోన్నతి

మధురవాడ: మధురవాడ విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో ఆర్జేడీ జ్యోతి కుమారి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి 10.45 గంటలకు స్కూల్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ ప్రారంభమైంది. విశాఖపట్నం జోన్-1 పరిధి ఉమ్మడి విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని వివిధ మండలాల్లో గల ప్రభుత్వ పాఠశాలల్లో గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా నియమించేందుకు ఈ కౌన్సెలింగ్ చేపట్టారు. ఈ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులుగా పని చేసిన 55 మందికి ఎంఈవో-1 పోస్టింగ్‌లు ఇచ్చిన నేపథ్యంలో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసేందుకు స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించారు. 46 మందితో సీనియార్టీ జాబితా తయారు చేయగా ఉమ్మడి మూడు జిల్లాల నుంచి 60 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ 46 మందికి మాత్రమే గ్రేడ్-2 హెచ్ఎంలుగా ప్రమోషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏడీ జి.శ్రీరామ్మూర్తి, సూపరింటెండెంట్ ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మెకానిక్' 'ఆర్ట్స్' సమర్పించు

ఐరన్‌మన్

- వాహన విడి పరికరాలతో రూపకల్పన
- పిల్లల్ని విశేషంగా ఆకట్టుకుంటున్న 'ఉక్కు'మనిషి
- తయారు చేసిన మెకానిక్‌లు

రూపకర్తలు వీరే


పైడి రాజు ఇస్మాయిల్ కామేష్ రాంబాబు


'ఉక్కు'మనిషి తయారు చేస్తున్న మెకానిక్‌లు

మల్కాపురం: కటౌట్ లేకపోయినా ఫర్వాలేదు..కంటెంట్ ఉన్నోడికే ఇక్కడ గుర్తింపు..నువ్వేం చదివావో అవసరం లేదు..నువ్వేం ఇరగదీశావో అదే నీ బ్రాండ్.. కాస్త భిన్నంగా..ఇంకాస్త టెక్నికల్‌గా ఆలోచిస్తే.. గొప్ప ఆవిష్కరణలు పుట్టుకొస్తాయి. నీ పేరు ఊరూరా తెలిసేట్టు చేస్తాయి. ప్రాణం లేని మరమనిషైనా నీకు కీర్తిని తెచ్చిపెడతాడు. అందుకే కలలు కనండి.. సాదాసీదాగా వద్దు..కాస్త ఇన్నోవేటివ్‌గా. అలా ఆలోచించారు కాబట్టే మన పారిశ్రామిక ప్రాంత కుర్రాళ్లు వార్తలకెక్కారు. ఆ విశేషాలేంటో చూసేద్దామా...!

వారంతా ఉన్నత విద్యావంతులుకారు. బతుకుదెరువు కోసం మెకానిక్‌లుగా జీవనం సాగిస్తున్నారు. ఏవో నాలుగు వాహనాలు మరమ్మతులు చేసి డబ్బులు సంపాదించుకోవాలని ఊరుకుంటే అందరిలాంటి మెకానిక్‌లుగానే ఉండిపోయేవారు. కానీ వారు అలా అనుకోలేదు. ప్రగతి టూ వీలర్ మెకానికల్ వెల్ఫేర్ అసోసియేషన్ 6వ వార్షికోత్సవం సందర్భంగా ఏదైనా కొత్తగా ట్రై చేయాలనుకున్నారు. మల్కాపురం సమీపంలోని పల్లివీధికికి చెందిన మెకానిక్ సమ్మిడి పైడిరాజుకు విడి పరికరాలతో ఐరన్‌మన్‌ను తయారు చేయాలని ఆలోచన వచ్చింది. వెంటనే స్నేహితులైన మల్కాపురం ప్రాంతానికి చెందిన ఇస్మాయిల్, గాజువాకకు చెందిన కె.కామేష్, బింది రాంబాబులకు చెప్పాడు. వారంతా కలిసి మరమనిషిని తయారు చేసేందుకు నిర్ణయించుకున్నారు. అసోసియేషన్ సాయంతో వివిధ వాహనాల పరికరాలతో ఐరన్‌మన్ తయారీకి రంగం సిద్ధం చేసుకున్నారు.

వీటితోనే..

వాహన గేర్‌వీల్స్, చైన్ పాకెట్స్, క్లచ్‌ప్లేట్స్, కనెక్టింగ్ రాడ్స్, లూనా నుంచి హీరో కరిజ్మా బైక్ వరకు సేకరించిన పరికరాలతో మే 2న ఈ ఐరన్‌మన్ తయారీకి రంగం సిద్ధం చేసుకున్నారు. 186 కేజీల బరువు, ఆరడుగుల 2 అంగుళాల ఎత్తు ఉన్న రోబో మాదిరిగా పరికరం తయారు చేసి.. దానికి ఐరెన్‌మన్ అని నామకరణం చేశారు. దీని తయారీకి 42 రోజులు పట్టింది. సుమారు రూ. 4 వేలు ఖర్చు అయింది. జూన్ 16న అసోసియేషన్ 6వ వార్షికోత్సవంలో దీనిని ప్రదర్శించారు. ఐరెన్‌మన్‌ని చూసి పలువురు చిన్నారులు మురిసిపోయారు. అసోసియేషన్ ప్రతినిధులు దామోదర్‌రావు, విష్ణుమూర్తి, రెడ్డిపల్లి రాజు, వంగపండు గణేష్ తదితరులు ఐరెన్‌మన్‌ను తయారు చేసిన ఆ నలుగురిని అభినందించారు.


ఆకట్టుకుంటున్న ఉక్కుమనిషి

తెలంగాణ వాసి అనుమానాస్పద మృతి

గాజువాక పంతులు గారి మేడ వద్ద మృతదేహం లభ్యం


అశోక్ మృతదేహం


అశోక్ గుర్తింపు కార్డు

అక్కిరెడ్డిపాలెం: గాజువాక పంతులు గారి మేడ వద్ద జాతీయ రహదారి పక్కన డివైడర్‌పై ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. మృతదేహాన్ని మంగళవారం గుర్తించిన స్థానికులు గాజువాక పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ కొల్లి సతీష్ సిబ్బందితో చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అతని వద్ద దొరికిన ఆధారాలతో తెలంగాణ రాష్ట్రానికి చెందిన కామిశెట్టి అశోక్(39)గా గుర్తించారు. అశోక్ ముక్కు, నోటి నుంచి రక్తం కారిన ఆనవాళ్లు ఉన్నాయి. అతని జేబులో నిపాన్ సర్వీసెస్‌కు చెందిన గుర్తింపు కార్డు లభించింది. ఆర్టీసీ బస్ అటెంటర్‌గా పనిచేస్తున్నట్లు అందులో ఉంది. ఆధార్ కార్డులో అశోక్, తండ్రి వెంకటేశ్వర్లు, డోర్ నంబర్ 12- 57, పాత గ్రామపంచాయతీ వెనుక బజార్, హుజూర్‌నగర్, నల్గొండ అనే వివరాలు ఉన్నాయి. అశోక్ పంతులుగారి మేడ వద్ద ఎలా మరణించాడు? మృతుడి ముక్కు, నోట్లో నుంచి రక్తం రావడానికి గల కారణాలు ఏంటి? తదితర వివరాలు పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత తెలుస్తాయన్నారు. లభించిన వివరాలతో అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

సరకు రవాణాలో వాల్తేరు డివిజన్ రికార్డ్


డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్‌కు 2023 జూన్ మరచిపోలేని నెలగా మిగిలిపోనుంది. సరుకు రవాణాలో, ఐరన్ ఓర్ లోడింగ్‌లో రికార్డులను తిరగరాసింది. ఈ సందర్భంగా సంబంధిత విభాగాల అధికారులను, సిబ్బందిని వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి అభినందించారు. అధికారులు, సిబ్బంది అకుంఠిత దీక్షతో సాధించిన రికార్డులు డివిజన్ నిరంతర అభివృద్ధిని సూచిస్తోందని డీఆర్ఎం తెలిపారు. వాల్తేర్ డివిజన్ 2023 జూన్‌లో 5.98 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేసింది. దీని ద్వారా రూ.700.20 కోట్లఆదాయాన్ని ఆర్జించింది. దీంతో ఇంతవరకు ఏ జూన్ నెలలో సాధించని రికార్డును డివిజన్ సాధించింది. గతంలో (జూన్ 2021లో) 5.50 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేసి రూ.623.34కోట్ల ఆదాయం నమోదు చేసింది. ఇప్పటి వరకు ఇదే అత్యుత్తమ రికార్డు కాగా ఈ ఏడాది సరికొత్త రికార్డు నమోదైంది.అదేవిధంగా వాల్తేర్ డివిజన్ ఈ ఏడాది జూన్‌లో రోజుకు 14.7రేక్స్ (రోజుకు సరాసరి 1.90మిలియన్ టన్నుల ఐరన్ ఓర్) లోడింగ్ చేసి మరో రికార్డు సాధించింది. గతంలో (జూన్ 2021లో) ఇది రోజుకు 12.7రేక్స్ (రోజుకు సరాసరి 1.70మిలియన్ టన్నుల ఐరన్ ఓర్)ను లోడింగ్ చేసి రికార్డు సాధించింది. దీనిని ఈ ఏడాది అధిగమించింది.

ఘనంగా రంగా జయంతి


రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ జీవీఎల్ నరసింహారావు

సింహాచలం: వంగవీటి మోహన రంగా జయంతిని అఖిల భారత కాపు సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ జీవీఎల్ నరసింహారావు అడవివరం ప్రధాన రహదారిలోని పైడితల్లి ఆలయం వద్ద ఉన్న రంగా విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగా ఒక మహా నాయకుడని కొనియాడారు. రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో రంగా విగ్రహం తొలగింపు అవశ్యం కావడంతో వేరో చోట స్థలం కేటాయించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అడవివరం కోఆపరేటివ్ సొసైటీ మాజీ డైరెక్టర్ సతివాడ శంకరరావు, కాపు సంఘం నాయకులు బి.రామజోగి, శ్రీనివాసరావు, బాల, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై పటిష్ట నిఘా


సూచనలిస్తున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

అల్లిపురం: గంజాయి రవాణాపై నగర పోలీస్ కమిషనర్ పటిష్ట నిఘా పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలోకి ప్రవేశించే మార్గాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి.. తనిఖీలు చేపడుతున్నారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేసిన తర్వాతే నగరంలోకి అనుమతిస్తున్నారు. తగరపువలస, అగనంపూడి సమీపంలోని చెక్ పోస్టుల్లో మూడు షిఫ్ట్‌ల్లో సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. గంజాయి రవాణాను అడ్డుకోవడంతో పాటు నగర భద్రతను పటిష్టం చేసేందుకు ఈ చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు సీపీ సీఎం త్రివిక్రమ్ వర్మ తెలిపారు.

కోర్టు మానటరింగ్ సిబ్బందితో సమీక్ష

అల్లిపురం: కోర్టులో ట్రైల్‌కు వచ్చే కేసుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్ వర్మ సీఎంఎస్ సూచించారు. సీఎంఎస్ (కోర్టు మానిటరింగ్ సిబ్బంది)తో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. ప్రతీ స్టేషన్‌లో పరిధిలో కేసుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సూచనలు చేశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ ప్రతి ఉన్నతాధికారికి ఐదు కేసులు మానటరింగ్ చేసే విధంగా ఆదేశాలు ఇచ్చామన్నారు. కేసుల విషయంలో క్రమం తప్పకుండా స్టేషన్ ఇన్‌స్పెక్టర్లతో మాట్లాడాలని సూచించారు. ఎక్కువ కేసులు ఉన్న రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లపై నిరంతరం నిఘా పెట్టాలన్నారు. ప్రతి నెలా కన్విక్షన్ పడుతున్న కేసుల సంఖ్య, అంతకుముందు నెలతో పోల్చినప్పుడు పెరుగుదల కనిపించాలని ఆదేశించారు. సమావేశంలో డీసీపీలు, ఏసీపీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.